సాక్షి నిజామాబాద్

బుధవారం । 14 । ఆగస్టు । 2024



మంచం పట్టిన బాల్కొండ

బాల్కొండలో ఇంటికొక్కరు కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

- 8లో ▸



రైతులకు అవగాహన..

ఉద్యానపంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ట్రెయినీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.8 /23.7

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొక్కలు నాటి సంరక్షించాలి



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): భావితరాల భవిష్యత్ కోసం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలంగాణ ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ కమాండెంట్ పి.రోహిణి అన్నారు. బెటాలియన్‌లో వనమహోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బెటాలియన్ ఆవరణలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి కమాండెంట్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కేపీ శరత్‌కుమార్, కేపీ సత్యనారాయణ, ఆర్‌ఐలు పి వెంకటేశ్వర్లు, బి శ్యామ్‌రావు, ఆర్ ప్రహ్లాద్, బి వసంత్‌రావు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తున్నాం



పెర్కిట్(ఆర్మూర్): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శనకు వెళ్తున్న డిప్యూటీ సీఎంతోపాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెర్కిట్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మార చంద్రమోహన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, అయ్యప్ప శ్రీనివాస్, పండిత్ పవన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, కొంతం మురళీధర్, జిమ్మి రవి, ఎండీ సలీం, ఖాందేష్ సత్యం, షేక్ మున్నా, అజ్జు, భూపేందర్, చిట్టిరెడ్డి, ముత్యంరెడ్డి, విజయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: వానాకాలం పంటల కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు పోతుండగా, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 4083 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1080.90(47.52 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

జాతీయ జెండా ఎగురవేయనున్న ఈరవత్రి

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యేలు అతిథులుగా హాజరుకానున్నారు.

జీపీలకు రూ.9.30 కోట్లు విడుదల

సుభాష్‌నగర్: జిల్లాలోని 530 గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9.30 కోట్లు విడుదలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తుల తరుణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని గ్రామపంచాయతీల ఖాతాల్లో ఇప్పటికే నిధులు జమ కాగా, కొన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి డిజిటల్ టోకెన్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతోనే నిధుల జమ ప్రక్రియ నిలిచినట్లు తెలిసింది. కాగా 6 నెలల తర్వాత పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాసర సమీపంలో గోదావరిలో కలుస్తున్న మహారాష్ట్ర ఫ్యాక్టరీలు వదిలిన రసాయనాలు.. (ఇన్‌సెట్‌లో) ఎస్సారెస్పీ వద్ద ఆకుపచ్చ రంగులోకి మారిన నీరు



ఇవి విష జలాలు కావా?

ఫ్యాక్టరీలు వదులుతున్న రసాయనాలతో గోదావరి జలాలు ఎంత విషతుల్య మవుతున్నాయో.. ఈ చిత్రాలను చూస్తేనే అర్థమవుతుంది. ప్రతి ఏటా వర్షాకాలం సీజన్‌లో మహారాష్ట్రలోని ధర్మాబాద్ పరిధిలోని లిక్కర్ ఫ్యాక్టరీ నుంచి ఏమాత్రం శుద్ధి చేయకుండా విష రసాయనాలతో కూడిన నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. నదీ జలాల శాంపిల్స్ సేకరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం గోదావరిలోకి అసలు విష రసాయనాలతో కూడిన జలాలే రావడంలేదని అంటున్నారు. ఎంత విచిత్రం..?

- కాలుష్య నియంత్రణ మండలి అధికారులెక్కడ?
- మహారాష్ట్ర ఫ్యాక్టరీలు వదులుతున్న రసాయనాలతో గోదావరి నీరు కలుషితం
- శ్రీరాంసాగర్ జలాశయంలో ఆకుపచ్చ రంగులో నీరు.. నీళ్లన్నీ దుర్వాసన
- నీళ్లు రంగుమారినప్పుడు కాకుండా సాధారణ సమయాల్లో శాంపిల్స్ తీస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సందర్భానుసారంగా కాకుండా వాళ్ల సమయానికి అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. పవిత్రమైన గోదావరి నదిలోకి టీఎంసీలకొద్దీ విషజలాలు వస్తున్నప్పటికీ తమకేమీ తెలియదన్నట్లు నటిస్తున్నారు. పైగా గోదావరిలోకి విషజలాలు వస్తున్న విషయమై ఫిర్యాదులు చేసిన ప్రజలు, రైతులను లెక్కచేయకపోవడంతో పాటు వార్తలు వస్తే అవన్నీ అవాస్తవాలంటూ ఏమార్చే ప్రయత్నాలు చేస్తుండడం పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలోకి విషజలాలు వచ్చిన సమయంలో శాంపిల్స్ సేకరించి కచ్చితమైన నివేదికను ఇవ్వాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు.. అందుకు విరుద్ధంగా తమ సమయానుకూలంగా శాంపిల్స్ సేకరించి అంతా సవ్యంగా ఉన్నట్లు బుకాయిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అంతా సవ్యంగానే ఉందని గోదావరిలోకి అసలు విష రసాయనాలతో కూడిన జలాలే రావడంలేదంటున్న అధికారులు మరి కళ్లముందు ఆకుపచ్చ రంగులో కనిపిస్తున్న జలాలకు సంబంధించి ఏం సమాధానం చెబుతారో చూడాల్సి ఉంది. అసలు మహారాష్ట్రలోని ధర్మాబాద్ లిక్కర్ ఫ్యాక్టరీలో వ్యర్థ రసాయనాలే విడుదల కావన్నట్లుగా వీరి వ్యవహార శైలి ఉండడం గమనార్హం. ప్రతి ఏటా వర్షాకాలం సీజన్‌లో ధర్మాబాద్ లిక్కర్ ఫ్యాక్టరీ నుంచి ఏమాత్రం శుద్ధి చేయకుండా విషరసాయనాలతో కూడిన నీటిని వాగు ద్వారా గోదావరిలోకి వదులుతుంటే ఆ సమయంలో శాంపిల్స్ సేకరించడం లేదు. ఒకవేళ సేకరించినప్పటికీ కచ్చితమైన నివేదిక ఇవ్వకుండా తూతూమంత్రంగా నివేదిక ప్రకటిస్తున్నట్లు రైతులు, గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు విమర్శిస్తున్నారు.

■ రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నది తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఇక్కడే మంజీర, హరిద్ర నదులు గోదావరిలో కలుస్తున్నాయి. తరువాత ప్రఖ్యాత బాసర సరస్వతి క్షేత్రం సమీపంలో రైల్వే వంతెన వద్ద గోదావరిలోకి విషజలాలు ధర్మాబాద్‌లోని పయనీర్ డిస్టిలరీస్ లిమిటెడ్ కార్మాగారం నుంచి వర్షాకాలంలో రాత్రి సమయంలో వచ్చి చేరుతున్నాయి. పెద్ద వాగు ద్వారా 5 కిలోమీటర్ల దూరం నుంచి రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5గంటల మధ్య రసాయన నీరు వస్తోంది. ఎస్‌టీపీ, ఈటీపీ ప్లాంట్‌లలో శుద్ధి చేయకుండానే 25 చెరువుల్లో నిల్వ చేసిన విషజలాలను గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని 120 గ్రామాల ప్రజలు ఈ నీటిని మిషన్ భగీరథ పథకం ద్వారా తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. మరోవైపు పశువులు ఈ నీరు నేరుగా తాగి మరణిస్తున్నాయి. ఐఐఐటీ బాసర విద్యార్థులు సైతం ఈ నీరే తాగుతున్నారు. ఈ నీటి కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పంటల దిగుబడులు విషతుల్యంగానే ఉంటున్నాయి. భూసారం పూర్తిగా దెబ్బతింటోంది. అనేకసార్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అంతా బాగానే ఉందని చెబుతూ తమకు అన్యాయం చేస్తున్నారని పరీవాహక గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ విషయమై నిజామాబాద్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయానికి 'సాక్షి' ఫోన్ చేయగా ఆ విషయం తమకు తెలియదని చూస్తామని చెప్పడం గమనార్హం.

మాజీ డీసీవో సింహాచలం సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన సహకార శాఖ డైరెక్టర్ అండ్ రిజిస్ట్రార్ ఉదయ్‌కుమార్
- భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ
- సింహాచలం అవినీతిపై పలు పరిశోధన కథనాలు ప్రచురించిన 'సాక్షి'



'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు



సింహాచలం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మాజీ జిల్లా సహకార అధికారి కె సింహాచలంను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర కో ఆపరేటివ్ డైరెక్టర్ అండ్ రిజిస్ట్రార్ పి ఉదయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సింహాచలం ప్రస్తుతం ఆదిలాబాద్ డీసీసీబీ రికవరీ ఓఎస్డీగా పనిచేస్తున్నాడు. సింహాచలం అవినీతి, అక్రమాలపై 'సాక్షి' పలు పరిశోధనాత్మక కథనాలను ప్రచురించింది. మరోవైపు ఈ వ్యవహారాలపై సుంకేట అన్వేష్‌రెడ్డి, సోమశేఖర్ అనే రైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు సైతం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విచారణ జరిపించింది. గత మార్చి 13న రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కమిషనరేట్ నుంచి విచారణ అధికారిగా జిల్లాకు వచ్చిన జాయింట్ రిజిస్ట్రార్ జె ప్రసన్న విచారణ జరిపారు. అనంతరం గత ఏప్రిల్ 25న ఆమె విచారణ నివేదికను ప్రభుత్వానికి అందించారు. దీంతో ప్రభుత్వం సింహాచలంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల కాపీని అందుకునేందుకు సింహాచలం అందుబాటులో లేకుండా వెళ్లడం గమనార్హం.

'సాక్షి' ప్రచురించిన కథనాల్లో అనేక అంశాలు..

సింహాచలం అవినీతి, అక్రమాలపై 'సాక్షి'లో పలు విడతల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. సహకార సంఘాల చైర్మన్లను వేధింపులకు గురిచేయడం, అక్రమాలను నిలదీసిన సీవోలను తీవ్రంగా లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెట్టిన అంశాలను, వారి వద్ద భారీగా వసూళ్లు చేసిన విషయాలను, సింహాచలం కారణంగా దివాలా తీసిన పలు సొసైటీలు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు సైతం డీసీవో ఖాతాల నుంచి చెల్లింపులు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ఫెర్టిలైజర్ కంపెనీలతో వ్యాపారం చేయడం, చెక్కులతో లావాదేవీలు చేయాల్సి ఉన్నప్పటికీ భారీగా నగదు డ్రా చేసిన వ్యవహారాలు, సొసైటీలకు వచ్చిన కమీషన్లను దండుకున్న వైనం, ద్విచక్ర వాహనాలపై వందల క్వింటాళ్ల ధాన్యం రవాణా చేసినట్లు దొంగ లెక్కలు చూపిన వైనంపై, పడగల్ సొసైటీలో 773 బస్తాలకు 100 బస్తాల కడ్తా తీయడం, బదిలీ అయినప్పటికీ రికార్డులను కొత్త డీసీవోకు అప్పగించని వైనం, పైగా తన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా నుంచి నిపుణులను తీసుకొచ్చి రికార్డులను ట్యాంపరింగ్ చేయడం తదితర వక్ర మార్గాలు, అక్రమ, అవినీతి వ్యవహారాలపై కథనాలను 'సాక్షి' ప్రచురించింది. దీంతో సింహాచలంపై చర్యలు తీసుకోవాలంటూ నిజామాబాద్ డీసీసీబీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం సైతం చేయడం విశేషం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు

- సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ నిర్ణయం
- కొనసాగుతున్న ఫీవర్ సర్వే



తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

మోర్తాడ్(బాల్కొండ): వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఇంటింటా ఫీవర్ సర్వే కొనసాగుతుండగా, క్యాంపులను నిర్వహిస్తూ ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగానే మందులు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఆశా వర్కర్లు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులు అదుపులోకి వచ్చే వరకు క్యాంపుల నిర్వహణ కొనసాగిస్తామని శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. క్యాంపుల నిర్వహణ ఎలా సాగుతోందని క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎవరికైనా ఆరోగ్యం క్షీణిస్తే వెంటనే పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

దాడులను సహించేది లేదు



ర్యాలీలో పాల్గొన్న హిందూ ఐక్య వేదిక నాయకులు, ఎమ్మెల్యే ధన్‌పాల్ తదితరులు

సుభాష్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులు, మారణ హోమాన్ని సహించేది లేదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో మారణకాండను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హిందూ మహిళలపై అత్యాచారాలు చేస్తూ చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. హిందువులకు అక్కడి ఆస్పత్రుల్లో వైద్యం నిరాకరించడంతో ఒకే రోజు 73 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బంగ్లాదేశ్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా హిందువులపై దాడులు జరుగుతున్నా.. దేశంలో సెక్యులర్ అని చెప్పుకునే జాతీయ, ప్రాంతీయ పార్టీలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. హిందువులను ఓటు బ్యాంకుగా వాడుకునే మమతా బెనర్జీ, కాంగ్రెస్ తమ స్వార్థ రాజకీయాల కోసం బంగ్లాదేశ్ అక్రమ చొరబాట్లకు కారకులై, దేశ విచ్ఛిన్నాన్ని కోరుకుంటున్నారని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్ శివకుమార్ జీ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఆలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం తలపెట్టిన ఇందూరు నగరం బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు, కార్పొరేటర్లు, హిందూ సంఘాల ప్రతినిధులు న్యాలం రాజు, గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, మంచాల జ్ఞానేందర్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, బంటు వైష్ణవి, ఎర్రం సుధీర్, సాయివర్ధన్, హరీశ్‌రెడ్డి, బట్టు రాఘవేందర్, వీహెచ్‌పీ, హిందూవాహిని, తపస్, బజరంగ్‌దళ్ నాయకులు కదం అనిల్, ధాత్రిక రమేశ్, నవీన్, రెంజర్ల నరేశ్, అనిల్, సుదర్శన్, విద్యార్థులు, హిందువులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

- ఐఎంఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఐఎంఏ ప్రతినిధులు, మెడికోలు

నిజామాబాద్‌నాగారం: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను వ్యతిరేకిస్తూ ఐఎంఏ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు నిర్వహించిన ర్యాలీ.. ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి బస్టాండ్ మీదుగా తిలక్‌గార్డెన్ వరకు కొనసాగింది. ఐఎంఏ ప్రతినిధులు, మెడికోలు కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. వైద్యురాలి మృతికి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొట్టూరు శ్రీశైలం మాట్లాడుతూ.. ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల ఆస్పత్రి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులపై అసాంఘికశక్తుల దాడులను అడ్డుకొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు. ఐఎంఏ ముఖ్య సలహాదారులు రవీంద్రారెడ్డి, వినోద్‌కుమార్ గుప్తా, ఉపాధ్యక్షులు విశాల్, జలగం తిరుపతిరావు, కార్యవర్గ సభ్యులు దీపక్ రాథోడ్, హరీశ్‌స్వామి, సత్యనారాయణ, ఫరీదాబేగం, పద్మిణిరెడ్డి, రాజేందర్, రాజశేఖర్, గీతాపాటిల్, అరుణ, ప్రజ్ఞ, నరేంద్ర, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ డాక్టర్ల సమ్మె

ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 14న సమ్మెకు పిలుపునిచ్చినట్లు జూడా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జితిన్, కార్యదర్శి డాక్టర్ అశీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలను మినహాయించి విధులను బహిష్కరించి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై వేగంగా విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ మేరకు సమ్మెకు సంబంధించిన నోటీసును ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమోహన్‌కు మంగళవారం అందజేశారు.

ఎస్సీ హాస్టల్‌లో ఏసీబీ తనిఖీలు

- ఉదయం 6 గంటలకే వసతిగృహానికి చేరుకున్న అధికారులు
- సుమారు 5 గంటలపాటు హాస్టల్‌లోనే..
- వంట సామగ్రి స్టాక్, రిజిస్టర్లు, మెనూ పరిశీలన
- ఏసీబీతోపాటు తనిఖీల్లో పాల్గొన్న మరో నాలుగు శాఖల అధికారులు



నగరంలోని ఎస్సీ హాస్టల్ వంటగదిని పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఎస్సీ మహిళా హాస్టల్(కోటగల్లీ)లో ఏసీబీ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఉదయం 6గంటలకే చేరుకున్న అధికారులు 11గంటల వరకు హాస్టల్‌లోనే ఉన్నారు. ఏసీబీ అధికారులతోపాటు ఫుడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, తూనికలు కొలతల, ఆడిట్ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. విద్యార్థినిలతో ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా మాట్లాడారు. భోజనం అంతగా రుచిగా ఉండదని, కొన్ని సందర్భాల్లో తినకుండానే పారేస్తున్నట్లు విద్యార్థినులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న ఎనిమిది రిజిస్టర్‌లను ఆడిటర్ సంతోష్ పరిశీలించి వాటికి సంబంధించిన బిల్లుల వివరాలను తెలుసుకున్నారు. ఒక్కో విద్యార్థినికి ఎన్నిక గ్రాముల ఫుడ్ అందిస్తున్నారని వార్డెన్ నాగలక్ష్మిని ప్రశ్నించారు. హాస్టల్ పరిసరాల్లో వర్షపునీరు నిలువడంతోపాటు మూత్రశాలలు శుభ్రంగా లేవని గుర్తించారు. మంచినీటి ట్యాంక్‌లను, వంటగదిని పరిశీలించి వంట మనుషులతో మాట్లాడారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ విద్యార్థినులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖ పరిధిలోని వివరాలను సేకరించారు. బియ్యం, పప్పులు, కారం, చింతపండు తదితర శాంపిళ్లను సేకరించిన అధికారులు.. వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు, అలాగే తనిఖీ నివేదికను ఏసీబీ డీఐజీ కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. హాస్టల్‌లోని నాణ్యత ప్రమాణాలపై ఎస్సీ వెల్ఫేర్ కమిషనర్‌కు నివేదించి సంబంధిత అధికారిపై చర్య లు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫుడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీత, ప్రభుదాస్, తూనికలు కొలత అధికారి ఎండీ సుజాత్‌అలీ, బిల్లు ఆడిటర్ సంతోష్, ఏసీబీ సీఐలు నగేశ్, శ్రీనివాస్ తనిఖీల్లో పాల్గొన్నారు.

ప్రారంభానికి ఎక్సైజ్ భవనాలు సిద్ధం

- ఈనెల 18 లేదా 20న జిల్లాకు రానున్న ఎక్సైజ్ మంత్రి
- ఆర్మూర్, మోర్తాడ్, భీమ్‌గల్‌లో భవన నిర్మాణాలు పూర్తి



మోర్తాడ్‌లో నిర్మాణం పూర్తయిన ఎక్సైజ్ స్టేషన్ భవనం

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో నూతనంగా నిర్మించిన మూడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మోర్తాడ్, ఆర్మూర్, భీమ్‌గల్‌లో భవన నిర్మాణ పనులు ఆరు నెలల క్రితం పూర్తయ్యాయి. 2018లో అప్పటి ప్రభుత్వం భవనాల నిర్మాణం కోసం రూ.40లక్షల చొప్పున నిధులను విడుదల చేసింది. నిధులు సరిపోక, బిల్లులు సకాలంలో మంజూరుకాకపోవడంతో పనులు పూర్తి కాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆయా ఇంజినీరింగ్ శాఖలకు ఆదేశాలను జారీ చేయగా, పనులు చకచకా పూర్తయ్యాయి. ఇప్పటి వరకు అద్దె భవనాల్లోనే స్టేషన్‌లను కొనసాగించారు. వాస్తవానికి బుధవారం రోజునే మంత్రి మూడు భవనాలను ప్రారంభించాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల మంత్రి పర్యటన వాయిదా పడింది. ఈనెల 18 లేదా 20 తేదీల్లో ఏదో ఒకరోజున ఎక్సైజ్ శాఖ మంత్రి మూడు భవనాలను ప్రారంభిస్తారని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు 'సాక్షి'తో తెలిపారు.

క్లుప్తంగా

వివాదాస్పద స్థలం పరిశీలన



పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్‌లో వివాదాస్పద స్థలాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం పరిశీలించారు. గ్రామంలో శ్మశాన వాటిక నుంచి గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లే మార్గం విషయంలో కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. దీంతో కలెక్టర్ స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఏసీపీ బస్వారెడ్డి, అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

బీఈడీ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీఈడీ నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్(కామారెడ్డి), ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షలకు 86 మందికి 78 మంది హాజరు కాగా 8మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1,308 మందికి 1,268 మంది హాజరు కాగా 40 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



మోర్తాడ్: మండలంలోని దొన్కల్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ ద్యావతి రవి(52) అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. మెండోరా పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రవి కొన్ని నెలల నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవి మృతదేహానికి ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, భీమ్‌గల్ సీఐ నరేశ్‌కుమార్, మోర్తాడ్, మెండోరా ఎస్సైలు అనిల్‌రెడ్డి, గోపి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గతంలో రవి భార్య కరోనా సమయంలో మృతి చెందారు. నాటి నుంచి కుమారుడు, కుమార్తెలను రవి కంటికి రెప్పలా పెంచాడు. తండ్రి మృతితో వారి రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

దరఖాస్తుల ఆహ్వానం



ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్గోలో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎం జానీరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో కార్గో పోస్టర్లను ఆర్ఎం జానీరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ఎవరైనా ఏజెంట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సెక్యూరిటీ డిపాజిట్ కింద గ్రామ, మండలస్థాయిలో రూ. వేయి, జిల్లాస్థాయిలో రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆర్టీసీ కార్గో కొరియర్ ద్వారా రాఖీలు, స్వీట్లు పంపిణీ చేసుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్గో సేవల కోసం ఆర్మూర్ 7396889496, బోధన్ 9014296638, నిజామాబాద్-1 9154298727, నిజామాబాద్-2 7396889496, బాన్సువాడ 9154298729, కామారెడ్డి 9154298729, ఆర్ఎం ఆఫీసు 8639963647 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మంచం పట్టిన బాల్కొండ



బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ఆస్పత్రికి తరలివచ్చిన రోగులు

- కాళ్ల వాపు.. కీళ్ల నొప్పులతో ప్రజల అవస్థలు
- ప్రతి ఇంట్లో జ్వరాలు

బాల్కొండ: మండల కేంద్రంలో ప్రజలు కాళ్ల వాపులు.. కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. అంతేకాకుండా ఇంటికొకరు జ్వరంతో మంచం పట్టారు. గత పది రోజులుగా విషజ్వరాలు ఎక్కువయ్యాయి. ప్రధానంగా జ్వరం వచ్చిన వారికి కాళ్ల వాపు, చేతి కీళ్లలో నొప్పులు వస్తున్నాయి. దీంతో గ్రామస్తులు చికెన్ గున్యా ప్రబలుతోందని ఆందోళన చెందుతున్నారు. గతేడాది మండల కేంద్రంలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ముగ్గురు డెంగీతో మృతి చెందారు. ప్రస్తుతం వింతగా జబ్బులు వస్తుండటంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నా జ్వరాలు తగ్గడం లేదు. దీంతో మండల కేంద్రంలోని క్లస్టర్ ఆస్పత్రిలో రోజుకు 300 మందికి పైగా ఓపీ పేషెంట్‌లు వస్తున్నారు. అంటే జ్వరాల తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

రక్త పరీక్షలు నిర్వహిస్తున్నా అన్నీ సాధారణం రావడం, కానీ కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులు ఉండటంపై గ్రామస్తులు భయపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భయపడాల్సిన పనిలేదు

మండల కేంద్రంలో వ్యాపిస్తున్న జ్వరాలు కేవలం వైరల్ ఫీవర్స్ మాత్రమే. కాళ్ల వాపు, కీళ్ల నొప్పుల కోసం రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎక్కడా ఎలాంటి సమస్య రావడం లేదు. విశ్రాంతి తీసుకుని సూచించిన మందులు వేసుకుంటే ప్రమాదం జరగదు. చికెన్‌గున్యా అంటు గ్రామంలో ప్రచారం జరుగుతోంది అలాంటిది ఏమీ లేదు. ప్రజలు ధైర్యంగా ఉండాలి. ప్రజలకు వైద్యశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. – డాక్టర్ స్రవంతి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, కిసాన్‌నగర్

రూరల్ పీఎస్‌లో ఆత్మహత్యాయత్నం

- ఎస్‌హెచ్‌వో గదిలో చున్నీతో ఉరేసుకున్న యువకుడు
- ఆస్పత్రికి తరలించిన పోలీసు సిబ్బంది



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్

నిజామాబాద్ రూరల్: తమ ప్రేమ పెళ్లిని పెద్దలు నిరాకరిస్తున్నారని ఆవేదనకు చెందిన ఓ యువకుడు నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌వో చాంబర్‌లో మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రమేశ్, ముబారక్‌నగర్‌కు చెందిన ఓ యువతి ఈ నెల 1న ఇంటి నుంచి పారిపోయి హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా సదరు యువతి ఇంట్లో ఉన్న బంగారంతో పాటు తన చెల్లిలి(మైనర్)ని తీసుకెళ్లింది. దీంతో వివాహ అనంతరం ప్రేమ జంట రూరల్ పోలీసులను ఆశ్రయించారు. వారు ఇరు కుటుంబాలను పీఎస్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువర్గాల వారు చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. కాగా తమ పెళ్లిని పెద్దలు అంగీకరించక పోవడంతో మనస్తాపానికి గురైన రమేశ్ ఎస్‌హెచ్‌వో గదిలో చున్నీతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటికి గమనించిన సిబ్బంది వెంటనే రమేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో ఎస్‌హెచ్‌వో జిల్లా కేంద్రంలోని ఏసీపీ సమావేశానికి వెళ్లారు. సకాలంలో రమేశ్‌కు వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న సీపీ ఆస్పత్రికి చేరుకొని రమేశ్ పరిస్థితిని తెలుసుకున్నారు.

లంచం కేసులో ఏడాది జైలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో లంచం తీసుకున్న కేసులో విద్యుత్ శాఖ ఏఏఈ మచ్చ సదాశివ్‌కు ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ. పదివేల జరిమానాను నాంపల్లి ఏసీబీ కోర్టు సెకండ్ అడిషనల్ స్పెషల్ జడ్జి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ తీర్పు విధించినట్లు నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ మంగళవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. మాక్లూర్ మండలం మదనపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, అతని బంధువుల వ్యవసాయ పొలాలు గ్రామంలో ఉన్నాయి. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు కొత్త కనెక్షన్లను ఏర్పాటు కోసం సదాశివ్‌ని సంప్రదించగా రూ.5 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతగా ఇవ్వలేమని రూ. 3వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ లంచం ఇవ్వడం ఇష్టం లేని శ్రీనివాస్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారులు ముందస్తు ప్రణాళికలో భాగంగా సదాశివ్ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కేసులో ఏసీబీ తరఫున లక్ష్మి మనోజ్ఞ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(హైదరాబాద్) వాదనలు వినిపించగా, ఇరువర్గాల వాదనలు విన్న నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ విద్యుత్ అధికారికి ఏడాది కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

ఇంటి పైకప్పు కూలి ఒకరికి గాయాలు



ఎల్లారెడ్డి: ఇంటి పైకప్పు కూలిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో నివాసం ఉండే నెల్లి శ్రీనివాస్ సోమవారం రాత్రి తన ఇంట్లో కూర్చుని ఉన్న సమయంలో ఒక్కసారిగా ఇంటి పైకప్పు పడింది. ఈ ఘటనలో అతడి కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వాటిని తొలగించి ఆస్పత్రికి తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన స్కార్పియో



నాగిరెడ్డిపేట: మండల కేంద్ర సమీపంలో ఓ స్కార్పియో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న స్కార్పియో మండల కేంద్ర సమీపంలో ఎదురుగా ప్రయాణిస్తూ సడెన్‌గా ఆగిన బస్సును తప్పించే క్రమంలో ఎక్సెల్‌ను ఢీకొని పక్కనే ఉన్న పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎక్సెల్‌పై ఉన్న లింగంపల్లికలాన్‌కు చెందిన వెంకటేశంకు గాయాలయ్యాయి. కాగా స్కార్పియోలో ఉన్న నలుగురికి ఎలాంటి గాయాలు కాలేదు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిట్లం: తల్లి మృతితో పాటు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మండడి భాషవ్వ(42) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి పిల్లలు లేరు. నాటి నుంచి పిట్లంలో ఉంటున్న తల్లి వద్దే ఉంటోంది. గతేడాది ఆమె తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి మృతితో పాటు ఆస్తమాతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఊరచెరువులో ఉదయం దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి అన్న గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



భరత్‌రెడ్డి(ఫైల్)

ఇందల్వాయి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎల్లరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఒంటరి భరత్‌రెడ్డి(25) ఏడాదిన్నర క్రితం రామడుగు గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నాడు. పదిహేను రోజుల క్రితం భరత్ గల్ఫ్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్న భార్య వద్దకు వెళ్లాడు. గతంలో సివిల్ కాంట్రాక్టర్ వద్ద పని చేసిన అనుభవం ఉండటంతో అక్కడే ఏదైనా ఉద్యోగం చేయాలనుకున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం మంగళవారం సాయంత్రం గ్రామానికి చేరుకోగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నీటికుంటలో పడి ఒకరి మృతి

బోధన్ రూరల్: మండలంలోని మినార్‌పల్లిలో మూడ్ పూల్‌సింగ్ (48) అనే వ్యక్తి నీటికుంటలో పడి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. పూల్‌సింగ్ సోమవారం రాత్రి కాలకృత్యాల కోసం గ్రామ శివారులోని పొలాల వైపు వెళ్లగా మనోహర్‌రెడ్డి అనే రైతు పొలంలోని నీటి కుంటలో పడి మృతి చెందాడు. కుంటలో ఉదయం మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన సిరికంటి మహేశ్(35) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న మహేశ్ ఈ నెల 9న పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా కుటుంబీకులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మంగళవారం ఉదయం మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య సిరికంటి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

లింగంపేట: ఎలుగుబంటి దాడిలో ఓ యువకుడిని గాయాలైన ఘటన మండలంలోని పొల్కంపేట లక్కీగాని తండా అటవీ శివారులో చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లంబాడి శ్రీనివాస్ మంగళవారం తన గేదెలను తీసుకొని రోజువారి లాగే అటవీ ప్రాంతానికి వెళ్లాడు. గేదెలు మేతమేస్తూ అడవిలోకి వెళ్లడంతో వాటిని వెతుక్కుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో ఎలుగుబంటి తల్లి, పిల్ల రెండు శ్రీనివాస్‌పై దాడికి యత్నించగా భయంతో అతను చెట్టుపైకి ఎక్కుతుండగా కుడికాలిని నోటితో పట్టి లాగడంతో తీవ్రగాయాలయ్యాయి. అతని వెంట కుక్కలు వాటిపై అరవడంతో అవి పారిపోయాయి. కొద్దిసేపటికి కిందికి దిగి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు వెంటనే కామారెడ్డి అక్కడికి చేరుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం



అజయ్ కుమార్

రెంజల్: మండల కేంద్రానికి చెందిన అజయ్‌కుమార్ అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. నిజామాబాద్‌లోని ఐటీఐలో సెకండియర్ చదువుతున్న అజయ్ ఈనెల 5న తన తండ్రి బైక్‌ని తీసుకొని కాలేజీకి వెళ్లాడు. నాటి నుంచి ఇంటి రాలేదు. దీంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రౌడీ షీటర్ రిమాండ్

బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన రౌడీ షీటర్ అబ్బును రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. గోషాల రోడ్డులోని వ్యాపారుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రూ. 10వేల జరిమానా

నవీపేట: మండలంలో ఇటీవల పట్టుబడిన మొరం టిప్పర్‌కు రూ. 10వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ నారాయణ మంగళవారం తెలిపారు. ఫతేనగర్ శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నవీపేటకు చెందిన టిప్పర్ యజమాని అక్రమంగా మొరం తరలించారని పేర్కొన్నారు. ఫిర్యాదులు రావడంతో దాడి చేసి టిప్పర్‌ను పట్టుకుని జరిమానా విధించినట్లు వెల్లడించారు.

ఉపాధి హామీలో అక్రమాలు

- పని చేయని వారి ఖాతాల్లో డబ్బులు
- ఒకే కుటుంబంలో రెండు, మూడు జాబ్ కార్డులు
- సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసిన అక్రమాలు



సభలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

రుద్రూర్: పేదలకు పని కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పని చేయని వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతూ పక్కదారి పడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి జాబ్ కార్డులు జారీ అవుతున్నాయి. వెరసి నిరుపేదలకు అందాల్సిన నిధులు అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తున్నాయి. మండలంలోని రాణంపల్లిలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం చేసిన ఆడిట్‌లో అక్రమాలు వెలుగుచూశాయి. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ఈజీఎస్ సోషల్ ఆడిట్ మండల స్థాయి ప్రజావేదిక నిర్వహించారు. ప్రజావేదికకు డీఆర్‌డీవో సాయాగౌడ్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఈజీఎస్ విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో సురేష్ బాబు, ఈజీఎస్ ఆడిట్ బృందం సభ్యులు హాజరయ్యారు. పది గ్రామాల ఆడిట్ నివేదికలను బృందం సభ్యులు చదివి వినిపించగా రాణంపల్లిలో భారీ అవకతవకలు జరిగినట్లు వెల్లడైంది. మేట్ రాజేశ్ చేతివాటం ప్రదర్శించినట్లు అధికారులు గుర్తించారు. రాజేశ్ కుటుంబంలోనే భార్య, భర్తలు చేరో జాబ్ కార్డు తీసుకుని రూ. 50,412లు పొందారు. ఈ విధంగా సుమారు రూ. లక్షా 99వేలు పక్కాదారి పట్టాయని ఆడిట్ సభ్యులు పేర్కొన్నారు. ఇవే కాకుండా పని చేయని వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశారని, మస్టర్‌లో సంతకాలలో తేడాలున్నట్లు గుర్తించారు. సుమారు రూ. 25 లక్షల వరకు అవినీతి జరిగినట్లు తెలుస్తోందని సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డీఆర్‌డీవోకు వినతిపత్రం అందచేశారు. నిబంధనలకు విరుద్ధంగా చెల్లించిన డబ్బులు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ప్రాథమికంగా మేట్ రాజేశ్‌ను తొలగిస్తున్నామని, దీనికి సహకరించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి



అంకాపూర్‌లో తోటను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

ఆర్మూర్: ఉద్యాన పంటల సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పిస్తే మరింత మెరుగైన దిగుబడిని సాధిస్తారని ట్రెయినీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ అన్నారు. ఉద్యాన తోటల సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మండలం అంకాపూర్, పెర్కిట్, చేపూర్‌లో పలువురు రైతులకు చెందిన తోటలను మంగళవారం ఆయన సందర్శించారు. రైతులు పెర్కిట్ భూమన్న, మార చిన్న గంగారెడ్డి, దశరథ్‌రెడ్డితో మాట్లాడి ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్ సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటల సాగు, బిందు సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి బండారి శ్రీనివాస్, ఆర్మూర్ నియోజకవర్గం ఉద్యాన శాఖ అధికారిణి సంధ్యారాణి, ప్రీనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డీజీఎం మల్లేశ్వర్ రావుతో మాట్లాడుతూ.. జిల్లాకు ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి కేటాయించిన లక్ష్యం, రెండేళ్లలో ఎంత విస్తీర్ణంలో పంట సాగు సాగవుతోంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేపూర్‌లోని ఆయిల్‌పామ్ నర్సరీని సందర్శించారు. ఆయన వెంట ప్రీనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ రోహిత్, క్లస్టర్ ఆఫీసర్ రాకేశ్ తదితరులున్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుందాం

మేయర్ నీతుకిరణ్



విజేతలకు బహుమతులు అందించిన మేయర్

నిజామాబాద్అర్బన్: స్వాతంత్ర్య పోరాటాన్ని, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుందామని నగర మేయర్ నీతూకిరణ్ అన్నారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్‌ను మేయర్ నీతూకిరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. విదేశీ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడానికి తెలుగు స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు తెలిపే సుమారు 30కి పైగా చిత్రాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ చిత్ర ప్రదర్శన బుధవారం కూడా కొనసాగనుంది. అనంతరం నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌మోహన్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎస్‌కే రసూల్ బీ, జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్, తెయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, ఆకాశవాణి ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్ దాస్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- వడ్డీ వ్యాపారి వేధింపులే కారణమని సెల్ఫీ వీడియో
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీబాయి

కామారెడ్డి క్రైం: వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక జిల్లా కేంద్రంలోని ఓ మహిళా బిల్డర్ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన వాగుమారి లక్ష్మీబాయి దేవునిపల్లిలో బిల్డర్‌గా పనిచేస్తోంది. ఆమెకు భర్త లేడు. ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటోంది. ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి పట్టణానికి చెందిన పాత విశ్వనాథం అనే వ్యాపారి వద్ద తన పేరిట ఉన్న ఇల్లు, ప్లాటును మార్ట్‌గేజ్ చేయించి రూ.32 లక్షల వరకు అప్పు తీసుకుంది. ఈ మధ్యనే అసలుతో పాటు వడ్డీ కలిపి చెల్లించినా ఇంకా రూ.66 లక్షలు అప్పు చూయిస్తున్నారని ఆమె తన సెల్ఫీ వీడియోలో రోదిస్తూ తెలిపింది. అదేంటని ప్రశ్నించినందుకు ఈ నెల 5న అతని బంధువులు ప్రదీప్, రాజశేఖర్, తేజతోపాటు మరో నలుగురు గుండాలను తీసుకువచ్చి దాడి చేశారని పేర్కొంది. అప్పు మొత్తం చెల్లించినా మార్ట్‌గేజ్ కింద రాయించుకున్న తన ఇల్లు, ప్లాటును తనకు తిరిగి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం లేదని వాపోయింది. సదరు వ్యాపారి వేధింపులను భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోలో పేర్కొంది. తన మృతితోనైనా తన పిల్లలకు ఇల్లు, ప్లాట్లను ఇప్పించాలని ఎస్పీ సింధూశర్మను వేడుకుంటున్నట్లు సోమవారం రాత్రి వీడియో చేసి వాట్సాప్‌లో పలువురికి పంపింది. ఆ తర్వాత పురుగు మందు సేవించి ఆత్మహత్యకుయత్నించగా చుట్టూ పక్కల వారు గమనించి వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. సోమవారం సాయంత్రం ఆమె దేవునిపల్లి పీఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశ్వనాథంతోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

టీటీడీ ఘాట్‌రోడ్‌లో ఆటోబోల్తా

బాన్సువాడ: బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానం గుట్టపైకి భక్తులతో వెళ్తున్న ఓ ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న 8 మంది భక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పుట్టిన రోజు వేడుకలను దేవస్థానంలో జరుపుకోవాలనే ఉద్దేశంతో నిజామాబాద్ జిల్లా నవీపేట్ నుంచి 12మంది భక్తులతో కూడిన ఆటో మంగళవారం కొండపైకి ఎక్కుతుండగా బోల్తాపడింది. ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో పైకి వెళ్లే క్రమంలో కిందికి జారి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న 8 ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు బీర్కూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు నలుగురిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అందులో ఇద్దరి కాళ్లు విరిగినట్లు తెలిసింది.

ఇసుక లారీ పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని శెట్లూర్, ఖద్గాం మంజీరా నుంచి లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గోపన్‌పల్లి గ్రామస్తులు మంగళవారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎలాంటి అనుమతులు లేకుండా శెట్లూర్, బిచ్కుందకు చెందిన వారు రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పట్టుకున్న లారీని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ సురేష్ జరిమానా విధించారు.

ఇసుక డంపుల స్వాధీనం

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన మూడు ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ మల్లేశ్ మంగళవారం పేర్కొన్నారు. సుమారు 25 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను బుధవారం వేలం నిర్వహిస్తామన్నారు. పోతంగల్ తహసీల్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, వేలంలో పాల్గొనే వారు రూ. ఐదు వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

పోతంగల్ శివారులో ఇసుక డంపులు మాయం

రుద్రూర్: పోతంగల్ శివారులోని మంజీరా బ్రిడ్జి సమీపంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులు మాయమయ్యాయి. అక్రమంగా ఇసుక డంపులు వేశారని విశ్వసనీయ సమాచారంతో 18 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను అధికారులు సీజ్ చేశారు. ఐతే మంగళవారం ఈ డంప్‌లను వేలం వేయాల్సి ఉంది. కానీ ఉదయం చూసే సరికి ఇసుక మాయమైంది.

ప్రభుత్వ అధికారులు సీజ్ చేసిన ఇసుక మాయం చేశారంటే వీరు ఎంతకు తెగించారో అర్థమవుతోంది. నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. బాధ్యులను గుర్తించి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.